## ప్రగతి కొనసాగించాలి

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



మారేడ్‌పల్లి, నవంబర్ 30: రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో జరిగాయని, పోలీస్ యంత్రాంగం కూడా గట్టి బందోబస్తును ఏర్పాటు చేసిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం మారేడ్‌పల్లి లోని కస్తూర్బా గాంధీ కళాశాలలో ఓటు వేసిన అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విలేకర్లతో మాట్లాడారు. హైదరాబాద్ మినీ ఇండియా అని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన ప్రగతి భవిష్యత్‌లో మరింత ముందుకు సాగుతుందన్నారు. 9 సంవత్సరాల్లో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి మన కండ్ల ముందే కనిపిస్తుందని తెలిపారు. హైదరాబాద్ నగరంలో అందరికీ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రపంచంలోని అన్ని వర్గాల ప్రజలను తెలంగాణ సమాజం హక్కున చేర్చుకుందని, ప్రజలందరూ ఈ రోజు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఈ సంతోషం ఎల్లప్పుడూ కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను, ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే ప్రతి ఒక్కరికీ ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి సూచించారు. హైదరాబాద్‌లో ఓటు వేయడానికి ప్రజలందరూ ఈ సారి పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చారని వెల్లడించారు.

## మేడ్చల్ జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు

మేడ్చల్, నవంబర్ 30(నమస్తే తెలంగాణ) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జరిగిన ఐదు నియోజకవర్గాల అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పర్యవేక్షణలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. 5 గంటల లోపు క్యూలైన్లలో ఉన్న వారికి టోకెన్ల్ ఇచ్చి ఓటు హక్కు వేసేందుకు అనుమతి ఇచ్చారు. ఉదయం నుంచి పోలింగ్ మందకొడిగా సాగినప్పటికీ మధ్యాహ్నం 3 గంటల నుంచి పోలింగ్ ఊపందుకుంది. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు. దివ్యాంగుల, మహిళలలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను వారు సద్వినియోగం చేసుకున్నారు.

### పోలింగ్ 56 శాతం (సా. 5 గంటల వరకు )

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ 56 శాతం నమోదుకాగా.. సాయంత్రం 5 గంటలలోపు క్యూలైన్‌లో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో పోలింగ్ శాతం 56 శాతంకు చేరుకున్నది..

| నియోజకవర్గం | పోలింగ్ శాతం |
|---|---|
| మేడ్చల్ | 62.09 |
| మల్కాజిగిరి | 53.99 |
| కుత్బుల్లాపూర్ | 56.74 |
| కూకట్‌పల్లి | 53.96 |
| ఉప్పల్ | 51.35 |



ఓటు హక్కును వినియోగించుకున్న మేడ్చల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి, ఆయన సతీమణి కల్పనరెడ్డి

## శివారులో ఓటెత్తారు

- గేటెడ్ కమ్యూనిటీల్లో ఎన్నికల సందడి
- క్యూలో ఉండి ఓటేసిన కాలనీవాసులు



సిటీబ్యూరో, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కోర్ సిటీని మినహాయిస్తే పోలింగ్ స్టేషన్ల వద్ద ఉదయం నుంచే ఓటర్లతో సందడిగా కనిపించాయి. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్లు పోలింగ్ ప్రక్రియ మొదలు కాగానే పోలింగ్ స్టేషన్లకు చేరుకొని ఓటు వేశారు. రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లు కలిగిన నియోజకవర్గంగా ఉన్న శేరిలింగంపల్లితో పాటు రాజేంద్రనగర్, ఎల్బీనగర్, కూకట్‌పల్లి,కుత్బుల్లాపూర్, మేడ్చల్, ఉప్పల్,మహేశ్వరం నియోజకవర్గాల్లో ఓటు వేసేందుకు ఆసక్తి చూపించారు. ముఖ్యంగా మొదటి సారి ఓటు హక్కు వచ్చిన యువతీ యువకులు ఆసక్తిగా పోలింగ్ స్టేషన్ల చేరుకొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత శివారు ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, హైరైజ్ అపార్టుమెంట్లు రావడంతో ఓటర్లు సైతం గణనీయంగా పెరిగారు. ఈ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు తమ ఓటు హక్కును వినియోగించుకునేందు ఆసక్తి చూపారు. పోలింగ్ స్టేషన్లు ఓటర్లు నివాసం ఉంటున్న ప్రాంతాలకు సమీపంలో ఏర్పాటు చేయడంతో సులభంగా చేరుకొని ఓటు వేశామంటూ బుద్వేల్‌కు చెందిన నరసింహా తెలిపారు. గతంతో పోలిస్తే పోలింగ్ స్టేషన్ల వద్ద ఎన్నికల అధికారులు చేసిన ఏర్పాట్లపై చాలా సంతృప్తి వ్యక్తం చేశారు.



దుండిగల్‌లో ఓటేసేందుకు బారులు

# గ్రేటర్‌లో ప్రశాంతంగా పోలింగ్

సిటీబ్యూరో, నవంబరు 30 (నమస్తే తెలంగాణ ) : గ్రేటర్‌లో శాసనసభ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, యాకుత్‌పుర నియోజకవర్గంలో చిన్నా చితక సంఘటనలు మినహా అన్నీ చోట్ల పోలింగ్ ప్రశాంతంగా ముగించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ జిల్లాలో 20వేల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొనగా..వేకువ జాము నుంచి రాత్రి వరకు విశ్రాంతి లేకుండా శ్రమించారు. అధికారులందరూ సంబంధిత జిల్లా ఎన్నికల అధికారులు మూడు దఫాల్లో విధులు ఎలా నిర్వహించాలన్న అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మోడల్ పోలింగ్ కేంద్రాలు ఓటర్లను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ముందుగా ఖరారు చేసిన రూట్లలో గురువారం రాత్రి సమయానికి ఈవీఎంలను పకడ్బందీగా స్ట్రాంగ్ రూములకు చేర్చారు. స్ట్రాంగ్ రూముల వద్ద 144 సెక్షన్‌తోపాటు మూడంచెల భద్రత విధానాన్ని ఏర్పాటు చేశారు. తొలి అంచెలో పారా మిలిటరీ, రెండో అంచెలో సాయుధ సిబ్బంది, మూడో దశలో సివిల్ పోలీసులు భద్రతా విధుల్లో ఉంటారు. అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా ఫైరింజన్లను అందుబాటులో ఉంచారు. ఈ నెల 3న జిల్లాలోని ఏడు చోట్ల ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలలో ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు.



బేగంపేటలో వృద్ధుడిని వీల్‌చైర్‌లో పోలింగ్ కేంద్రానికి తీసుకువస్తున్న సిబ్బంది

### బస్తీల్లో భారీగా పోలింగ్

పోలింగ్‌కు ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ఉదయం 11 గంటల వరకు మందకొడిగా సాగారు. మధ్యాహ్నం తర్వాత ఓటర్లు భారీ పోటెత్తారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో క్యూ లైన్ల ఉన్న వారందరికీ అవకాశం కల్పించగా, కొన్ని చోట్ల రాత్రి 8 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరిగింది. విద్యావంతులు అధిక సంఖ్యలో పోలింగ్‌కు దూరంగా ఉండగా..బస్తీ వాసులు భారీ తరలివచ్చారు. పలువురు ప్రముఖులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంలను స్ట్రాంగ్ రూములకు తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి , జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.

**రౌండ్ల వారీగా పోలింగ్ సరళి (శాతంలో)**

| నియోజకవర్గం | రౌండ్-1 (ఉ. 9) | రౌండ్-2 (ఉ. 11) | రౌండ్-3 (మ. ఒంటి గంట) | రౌండ్-4 (మ. 3) | రౌండ్-5 (సా.5 గంటలకు) | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| ముషీరాబాద్ | 3.94 | 10.54 | 17.38 | 27.98 | 40.24 | 49.61 |
| మలక్‌పేట | 8.2 | 11.24 | 18.36 | 29.16 | 36.9 | 41.00 |
| అంబర్‌పేట | 7.12 | 14.83 | 24.06 | 34.3 | 40.69 | 50.52 |
| ఖైరతాబాద్ | 6.5 | 15.1 | 26.1 | 37 | 45.5 | 51.31 |
| జూబ్లీహిల్స్ | 5.01 | 14.32 | 21.98 | 35.6 | 44.2 | 45.20 |
| సనత్‌నగర్ | 1.02 | 16.08 | 27.59 | 39.27 | 45.1 | 50.74 |
| నాంపల్లి | 0.64 | 5.42 | 18.62 | 22.7 | 32.4 | 42.76 |
| కార్వాన్ | 15.15 | 20.15 | 25.38 | 32.4 | 40.49 | 46.50 |
| గోషామహల్ | 2.89 | 13.64 | 15.83 | 35.88 | 45.79 | 54.93 |
| చార్మినార్ | 3.4 | 9.94 | 17.7 | 29.83 | 34.02 | 41.45 |
| చాంద్రాయణగుట్ట | 4 | 8.5 | 16 | 24.6 | 39 | 45.00 |
| యాకుత్‌పుర | 0.53 | 5.28 | 12.42 | 20.09 | 27.87 | 39.69 |
| బహదూర్‌పుర | 4.15 | 11.26 | 20.04 | 30.51 | 39.11 | 44.86 |
| సికింద్రాబాద్ | 5.1 | 15.73 | 26.01 | 36.31 | 45.01 | 49.60 |
| కంటోన్మెంట్ | 5.1 | 15.7 | 27.7 | 37.89 | 47.14 | 49.40 |



# గ్రేటర్ ఓటరు..గడప దాటరు

- 2018లో కంటే తగ్గిన పోలింగ్ శాతం
- ఈ సారి 49శాతం నమోదు
- స్ట్రాంగ్ రూంలకు చేరిన ఈవీఎంలు

సిటీబ్యూరో, నవంబరు 30 (నమస్తే తెలంగాణ ) : గ్రేటర్ ప్రజలు మళ్లీ నిర్లక్ష్యాన్ని వీడలేదు. ఓటర్లుగా పేర్లయితే నమోదు చేసుకున్నారు కానీ పోలింగ్ బూత్ వరకైతే రాలేకపోయారు. 2018 సంవత్సరంలో 50.3 పోలింగ్ శాతం నమోదు అయితే ఈ సారి 49 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. దీనిక్కారణం నవ ఓటర్లు.. యువ ఓటర్లు ఎంతో పెరిగినా పోలింగ్‌లో వారి పాత్ర నామమాత్రంగానే కనిపించింది. ఓటర్లందరూ ఓటు హక్కును వినియోగించుకోవడానికి వీలుగా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలన్నింటికీ సెలవులు ప్రకటించినా పోలింగ్‌లో పెద్దగా పెరుగుదల కనిపించలేదు. పార్కులు, మాల్స్ తదిరతరవైనవన్నీ బంద్ పాటించినా ప్రజలు హాలిడేగానే చూశారు. చాలా మంది ఓటరు గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుందని మాత్రమే ఓటర్లుగా పేరు నమోదు చేయించుకున్నారని పలువురు వ్యాఖ్యానించారు. ఫేస్‌బుక్, ట్విట్టర్ల పోస్టులతో సమస్యలపై వేలెత్తి చూపే సాఫ్ట్‌వేర్, యువత కూడా పాలకుడిని ఎన్నుకునే విషయంలో మౌనం వహించారు. ముఖ్యంగా ఆరోగ్యం సహకరించకున్నా లెక్క చేయకుండా వృద్ధులు పోలింగ్ బూత్‌ల వద్ద భారీగా క్యూలో నిలబడి ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని పలువురిని ఆదర్శంగా నిలిచారు. సినీ, రాజకీయ ప్రముఖులు సైతం పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. నగర శివార్లలో ఓటింగ్ నమోదు అధికంగా నమోదు కావడం గమనార్హం.